శ్రీ శుకబ్రహ్మాశ్రమము

గ్రంథములు

	రూ. పై
1. గీతామకరందము	70-00
2. GITA MAKARANDA	70-00
3. యోగవాసిష్ఠ రత్నాకరము	60-00
4. రామాయణ రత్నాకరము	50-00
5. భారత రత్నాకరము	50-00
6. భాగవత రత్నాకరము	50-00
7. ఉపనిషద్రత్నాకరము	40-00
8. గీతోపన్యాసములు	30-00
9. మోక్షసాధన రహస్యము	30-00
10. పరమార్థ కథలు	30-00
11. బ్రహ్మచర్య విజయము	30-00
12. అధ్యాత్మరామాయణము	15-00
13. ఆత్మాను సంధానము	15-00
14. బ్రహ్మానంద వైభవము	15-00
15. భజన కీర్తనలు	15-00
16. శ్రీవాసిష్ఠ మహారామాయణము	15-00
17. అమృత బిందువులు	15-00
18. శ్రీమద్భగవద్గీత (స్థూలాక్షరి)	15-00
19. శ్రీమద్భగవద్గీత (మూలం)	5-00
20. వివేకానంద సింహనాదము	15-00
21. యమలోక వార్తలు	4-00
22. శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల జీవిత చరిత్ర	20-00
23. తత్వసారము	3-00
[illegible]మానసబోధ	3-00
[illegible]	3-00
[illegible]	3-00
[illegible]	[illegible]0
[illegible]	[illegible]0
29. మట్టిలో మాణిక్యము	2-00
30. ప్రణవ పూజ	2-00
31. గౌరీ పూజావిధానము	2-00
32. ద్వాదశమంజరి	2-00
33. మోక్షద్వారపాలకులు	2-00
34. ఆత్మతత్వవిచారణ	2-00
35. ఆధ్యాత్మ హితోక్తులు	2-00

కేసట్లు

1. శ్రీ స్వామివారి ఉపన్యాసము (కేసెట్ 1 అధ్యాయం)	35-00
2. తత్వసారము	35-00
3. మానసబోధ	35-00
4. తత్వగీత	35-00
5. యతిగీత	35-00

శ్రీ స్వాములవారి వీడియో కేసెట్స్
ఒక కేసెట్ రూ. 140/-
మొత్తము సెట్ రూ. 2,250/-

మాసపత్రిక

వేదాంతభేరి సంవత్సర చందా	30 00
శాశ్వత చందా	300 00

గ్రంథములు కావలసిన వారు ఈ క్రింది చిరునామాకు వ్రాయవలెను.

మేనేజరు
శుకబ్రహ్మాశ్రమము
శ్రీ శుకబ్రహ్మాశ్రమము పోస్టు
శ్రీకా[illegible] [illegible]640, చిత్తూరుజిల్లా

ద్వాదశ మంజరి



శ్రీ శుక బ్రహ్మాశ్రమము

శ్రీ కాళహస్తి

ద్వాదశ మంజరి

రచయిత :

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము

శ్రీకాళహస్తి

1992

వెల : 2-00 పై.

9-వ కూర్పు వరకు : 24,000 ప్రతులు
10-వ కూర్పు : 1992 3,000 "

కాపీరైటు రిజిష్టర్డు

ప్రతులకు :
మేనేజర్, ఫోన్ : 2543, 2239

శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీ శుకబ్రహ్మాశ్రమము పోస్టు,
శ్రీ కాళహస్తి (చిత్తూరు జిల్లా) (ఆం. ప్ర)
పిన్ : 517640

ముద్రణ :
శ్రీ కృష్ణచిత్ర ప్రింటర్స్,
4, నాగేశ్వరరావు రోడ్డు,
టి. నగర్, మద్రాసు-600 017.
ఫోన్ : 441286

పరిచయము

శ్రీ శుకబ్రహ్మాశ్రమమున ప్రతి సంవత్సరము జరుగు వార్షికోత్సవమునందు 'జ్ఞానపుష్ప'మను పేరుతో ఆధ్యాత్మిక ప్రబోధములతో గూడిన ఒకానొక కరపత్రము భక్తులకు పంచిపెట్టబడుచుండును. ఆశ్రమముయొక్క ద్వాదశ వర్ష సమాప్తి సూచక మగు మౌక్తికోత్సవ సందర్భమున, గడచిన పండ్రెండు సంవత్సరములం దొసంగబడిన జ్ఞానపుష్పము లన్నిటిని చేర్చి ఒక చిన్న పుస్తక రూపమున ప్రకటించిన బాగుండునని తోచుటచే ప్రస్తుత గ్రంథమును గూర్చిన ప్రయత్నము గావింపబడినది. ఆ పండ్రెండు జ్ఞానపుష్పములను జేర్చి ద్వాదశమఞ్జరియను పేరుతో ఈ పుస్తకము ప్రకటింపబడినది. సాధకులకు ముముక్షువులకు ఆవశ్యకమైనట్టి పెక్కు అంశము లుండుటఁ బట్టి ఈ పుస్తకము పరమార్థ యత్నశీలురకు లెస్సగ ఉపకరింపగలదని భావించుచున్నాము.

ఓమ్

ఇట్లు
ప్రకాశకులు

పర్వత సమానములగు మహావిఘ్నములు అడ్డు తగిలినను వానిని దాటుదమను ధృఢ సంకల్పము కలిగియుండుడు. లోకమంతయు మిమ్ము ప్రతిఘటించి నిల్చినను సత్యమార్గముననే (దైవ మార్గముననే) ప్రవర్తింపుడు. మీ ఆలుబిడ్డలు మీకు ప్రతికూలురుగా నున్నను, మీ ద్రవ్యమంతయు పోయినను, మీ పేరు ప్రతిష్ఠలు నశించినను, మీ సంపద అదృశ్యమైనను దైవమార్గము వీడరాదు. గమ్యమును చేరువరకు అచంచల దీక్షతో దానినే అనుసరించుడు.

—స్వామి వివేకానంద

ద్వాదశ మంజరి

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

జ్ఞానపుష్పము–1

మానవ కర్తవ్యము

అనాదియగు ఈ సంసార ప్రవాహమున బడి జీవుడు విశ్రాంతి లేక "ఆవర్తాంతర కీటవత్" సుడిలో పడిన పురుగు వలె గిరగిర తిరుగుచు, నానా యోనులందు జన్మించుచు అత్యంత ఖిన్నుడై ప్రవర్తించుచున్నాడు. అట్టివానికి శాంతి యెట్లు లభించును? శాస్త్రము లన్నియు ఈ పరిశోధననే కావించినవి. మహనీయులందరున్ను ఈ ప్రశ్నను విడదీయుటయందే తమ జీవితములను ఆహుతి జేసిరి తుట్టతుదకు పరిష్కార మార్గమును కనుగొనిరి. అది యేది? ఎచట నుండి బయలుదేరెనో, అచటికి చేరుటయే. అదియే శాంతికి మార్గమని వారు వచించిరి. **Religion** (మతము) అను ఆంగ్లపదమునకు అర్థమున్ను ఇదియే. **Re=again** (తిరిగి), **Ligio=to unite** (కలియుట). విడిపోయిన జీవిని తిరిగి పరమాత్మతో కలుపునదియే మతమని భావము. సముద్రములోని నీరు ఎండ కాలమున ఆవిరియై మేఘ రూపముగా మారును. అనగా నీరు తన స్వస్థానమగు సముద్రమును వీడి పైకిపోవును. అపుడది చాల దిగులుపడి ఎట్లయినను తన జన్మస్థానమగు సముద్రమును తిరిగి జేరుటకు కృతనిశ్చయమై పోయి పోయి కొండలపై వర్షించి, శిఖరముల నుండి క్రిందకు ద్రొళ్ళి, నదీ రూపమున పీఠభూమిపై వేలకొలది మైళ్ళు ప్రయాణము సాగించి, తుట్టతుదకు సముద్రములో కలసి తన ప్రతిజ్ఞను ఎట్టకేలకు నెరవేర్చుకొనుచున్నది. ఆహా! జీవులకు అది యెట్టి పాఠమును నేర్పుచున్నది.

అలాగుననే జనులున్న తాము అనాదికాలమున ఏ పరమాత్మ నుండి విడిపడి ఈ జనన మరణ ప్రవాహమున తగుల్కొని యున్నారో ఆ పరమాత్మను తిరిగి చేరువఱకును విశ్రాంతి తీసికొనరాదను పట్టుదల కలిగియుండవలెను. పరమాత్మను జేరినపుడే జీవితనాటకము సమాప్తము కాగలదు. మరణముతో జీవితము ఎన్నటికిని సమాప్తము కాదు. "నిర్దోషం హి సమం బ్రహ్మ" అనునట్లు సమరూపమగు పరబ్రహ్మమును పొందినపుడే సమాప్తము కాగలదు. (సమం–బ్రహ్మ, ఆప్తం=సమాప్తమ్) అపుడే **fullstop** (పూర్ణవిరామము) పెట్టినట్లగును. జీవితమునకు తత్పూర్వము **coma** (అపూర్ణవిరామము) మాత్రమే యుండుటచే మరల పుట్టుచు మరల చచ్చుచు అంతులేక యుండును. కావున ఆత్యంతిక దుఃఖవినాశము కొఱకై జీవుడు ఏదియో యొక కాలమున పరమాత్మతో చేరియే తీరవలెను. అట్లు పరమాత్మతో జీవుని చేర్చునదియే జ్ఞానము, తన గమ్యమును చేరు వరకు ఎన్ని అడ్డంకులు వచ్చినను ఆగనట్లు సాధకులున్న తమ లక్ష్యమగు దైవమును చేరువరకు మధ్యలో ఎన్ని అవాంతరములు వచ్చినను తమ భగవద్ధ్యాన చింతనాదులను విడువరాదు. అజ్ఞాన మహాపాదపవిచ్ఛేదమున జ్ఞానముద్వారా అజ్ఞానమును నాశము చేసి తన పుట్టిల్లగు సచ్చిదానంద సమరూప బ్రహ్మను చేరుటయే మానవ కర్తవ్యము. "మా=అజ్ఞానము, న=లేకుండ, వ=వర్తించువాడు" మానవుడని చెప్పబడును. మానవ శబ్దము యొక్క వ్యుత్పత్త్యర్థమిదియే కాన జ్ఞాన సంపదను బడసి తద్ద్వారా నిరతిశయానందమగు కైవల్యమును పొంది దుఃఖరహితులై మానవ జీవిత కర్తవ్యమును నెరవేర్చు కొందురు గాక !

ఆధ్యాత్మిక ప్రవచనములు

1. ఓంకారము సర్వ మంత్రములకును మూలము. అద్దాని ధ్యానముచే చిత్తము శుద్ధమయి సమస్త పాపములు హరించి పోవును. సముద్రమును దాటుటకు ఓడ ఎటువంటిదో అలాగున సంసార దుఃఖసాగరము నుండి తరింపజేయుటలో ఓంకారమనెడు నావకు సమానమైనది మఱి యొకటి లేదు.

(శ్రీ మహర్షి మలయాళస్వాములవారు)

2. నశ్వరములును, దుఃఖ ప్రమాద నిలయములు నగు సంసార తరంగములకు జడియక, ఒక చేతితో కన్నీటిని తుడుచుచు రెండవ చేతితో అచంచలమైన దీక్షతో నెవ్వడు మోక్షమును అందుకోగలడో వాడే ధీరుడు.

(శ్రీ వివేకానందస్వామి)

3. మనుజులారా! నేడో రేపో చచ్చుట నిశ్చయము! మోసపోకుడు! దుష్టుల సాంగత్యములను విడువుడు ! జాగ్రత్త పడుడు ! పాపము చేయకుడు ! భగవంతునకు భయపడుడు !

(శ్రీ ఏసుక్రీస్తు)

4. శిష్టాచరణమే (సత్కర్మయే) విత్తనముగను, భక్తియే వర్షముగను, ప్రయత్నమే నాగలిగను, ధర్మశాస్త్రమే మేడిగను ,వివేక వినయములు ఎద్దులుగను, మనస్సు కళ్ళెముగను, శ్రద్ధయే కొరడాగను ఉపయోగించి భ్రమ నాశనమను సేద్యము చేసినచో నిత్యానందమను పంట పండును.

(శ్రీ బుద్ధదేవుడు)

5. వాస్తవముగ దారుణ కష్టములలో సైతము నన్ను రక్షించినది ప్రార్థనయే. కేవల నిరాశా సమయములలో సైతము నాకు ఆశా జ్యోతిని చూపినదియు ప్రార్థనయే. నా జీవితమునకు ప్రార్థనయే రక్షణ. ఈ ప్రార్థనయే లేకున్నచో నాకెప్పుడో పిచ్చియెత్తి యుండెడిది.

(శ్రీ మహాత్మాగాంధీజీ)

6. యత్నపూర్వకముగ ఈ జీవితమును పవిత్రవంతముగ నొనర్చుకొనవలయును. వార్ధక్యము రాక పూర్వమే, ఇంద్రియ పటుత్వము తగ్గకమునుపే, ఆయుస్సు క్షీణింపక ముందే, ఈ శరీరము స్వస్థముగా నున్నపుడే మోక్ష ప్రాప్తికై మహా ప్రయత్నమును గావింపవలయును.

(శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు)

హరిః ఓం తత్ సత్

గమనించదగినది:- పైన దెల్పిన సదుపదేశ వాక్యములలోని ప్రతి మొదటి యక్షరమును చేర్చి చదివినచో 'ఓం నమశ్శివాయ' అను పంచాక్షరీ మహా మంత్రము ఏర్పడును.

జ్ఞానపుష్పము-3

దైవప్రార్థన

కరుణామూర్తియగు సర్వేశ్వరా! మా చిత్తము సర్వ కాల సర్వావస్థల యందును నీ పాదార విందములందు లగ్నమై అచంచల మైన భక్తితో కూడియుండునట్లు అనుగ్రహింపుము.

పరమ దయానిధీ! ప్రాతఃకాలమున నిద్ర లేచినది మొదలు మరల పరుండు వరకును మనో వాక్కాయములచే మావలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును, ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయు లాగునను సద్బుద్ధిని దయచేయుము!

సచ్చిదానందమూర్తీ! నిర్మలాత్మా! మా యంతఃకరణమునందు ఎన్నడును ఏ విధమైన దుష్ట సంకల్పముగాని, విషయవాసన గాని, అజ్ఞానవృత్తి గాని జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము.

వేదాంత వేద్యా! అభయ స్వరూపా! మా యందు భక్తిజ్ఞాన వైరాగ్యబీజము లంకురించి శీఘ్రముగ ప్రవృద్ధము లగునట్లు ఆశీర్వదింపుము! మరియు ఈ జన్మమునందే కడతేరి నీ సాన్నిధ్యమున కేతెంచుటకు వలసిన శక్తి సామర్థ్యములను కరుణతో నొసంగుము.

దేవా! నీవు భక్తవత్సలుడవు! దీనులపాలిటి కల్పవృక్షవు! నీవు తప్ప నాకింకెవరు దిక్కు? నిన్ను ఆశ్రయించితిని. అసత్తునుండి సత్తునకు గొనిపొమ్ము. తపస్సునుండి జ్యోతి లోనికి తీసుకొనిపొమ్ము!

మృత్యువు నుండి అమృతత్వమును పొందింపజేయుము. ఇది మా వినతి. అనుగ్రహింపుము. నీ దరి జేర్చుకొనుము, పాహిమాం, పాహిమాం పాహిమాం, పాహి.

ఓం తత్ సత్

[ఈ ప్రార్థనను ఎవరు ప్రతి దినము నియమము తప్పక ఉదయము నిద్ర లేచునపుడు రాత్రి పరుండబోవునపుడు మనస్ఫూర్తిగా పఠించుదురో, అట్టివారికి జీవితమునందేలాటి దోషములున్ను కలుగుకుండుటయే గాక సర్వేశ్వరునియొక్క అనుగ్రహమునకున్ను వారు పాత్రులు కాగలరు]

జ్ఞానపుష్పము–4

హెచ్చరిక

ఓ జీవులారా! మహత్తరమై, దుఃఖవర్జితమై, ఉపాధిరహితమై, భ్రమ శూన్యమైనట్టి ఆత్మనే (భగవంతునే) ప్రయత్నపూర్వకముగ ధ్యానింపుడు. భుజించుచున్నను, త్రాగుచున్నను. కూర్చొనుచున్నను, నడచుచున్నను ఆత్మను గూర్చియే ప్రతి దినము లెస్సగ విచారణ సలుపుడు! ఈ దృశ్య ప్రపంచము నశ్వరమని మనస్సునందు నిశ్చయించి విషయభోగముల యెడల ఆసక్తిని వదలుడు! యుక్తులచేతను, గురు శాస్త్రోపదేశముచేతను చిత్తమను బాలకుని మెల్ల మెల్లగ లాలించి, పాలించి ఆత్మోన్ముఖ మొనర్పుడు! మనస్సు బాలుని చందమున ఏ దృశ్య పదార్థములందు నిమగ్న మగునో వానినుండి అద్దానిని మరలించి, ఆత్మయందే నియోగింపుడు! ఆత్మనే సదా అన్వేషింపుడు! ఆత్మనే సదాస్తోత్రము చేయుడు! ఆత్మనే ధ్యానింపుడు!

వ్రణమందు పురుగువలె స్వల్పములగు కాంతాన్నపానాది భోగములందే మీ మీ జీవితములను ధారబోయకుడు! అనర్థకరమగు దృశ్యవిచారణచే మీ ఆయువును వ్యర్థము చేయకుడు! జ్ఞానసారమగు పరమాత్మ బోధచే దృశ్యమును ఆత్మయందు లీలమొనర్చి పరమ శాంతిని బడయుడు! ఇంద్రియములను త్రాళ్ళచే కట్టుబడి ఈ సంసారమను పాడుపడిన చీకటి నూతులందు పడి నశింపకుడు! దౌర్భాగ్యదాయకమును, అశుభమునగు సాంసారిక విచారణయను ఘనీభూతమగు దీర్ఘ అజ్ఞాన నిద్రనుండి మేలు కొనుడు! చిన్న దొరువునందలి

ముసలి తాబేలువలె నిద్రపోవుచు ప్రమత్తులై యుండరాదు. వార్ధక్య మరణాది సంసార దుఃఖమును అంత మొనర్చుటకై జన్మరాహిత్యము నొందుటకై, లెండు! యత్నశీలురు కండు!

దృశ్య విషయములందు నిమగ్నమై కామమను దారువునందు ఎద్దువలె చిక్కుకొని పోయినట్టి మీ మనస్సును బలాత్కారముగ లేవ దీయుడు! దేహాది తాదాత్మ్యధ్యానరూపమగు శయ్యపై పరుండియున్న మనస్సును సంసార దుఃఖవినాశము కొఱకును ఉత్తమ జ్ఞానప్రాప్తి కొఱకును నిరంతరము మేలుకొలుపుడు! సంసారము మహా దుఃఖ పద మైనదిసుమీ! కావున చిత్తమను గొలుసును ఆత్మస్వరూప జ్ఞానమను యుక్తిచే ఛేదించివైచి మహాధైర్య మవలంబించి మాయ యను బోను నుండి స్వాత్మయను సింహమును విడిపింప జేయుడు! ధైర్య మొకటి తప్ప మఱి యేదియును మిమ్ములను ఈ సంసార సంకటమునుండి ఉద్ధరింప జాలదు. కావున, ఉత్తిష్ఠత! జాగ్రత్త! ప్రాప్యవరాన్ నిబోధత! లెండు! మేలుకొనుడు! మహనీయులగు సద్గురువులను సేవింపుడు!

ఓం తత్ సత్

జ్ఞానపుష్పము–5

గురు శిష్య సంవాదము

1. శిష్యుడు:- గురుదేవా! అపారమైన సంసార సముద్రము నందు మునిగిపోవుచున్న నాకు శరణ్య మేది?

గురువు:- భగవానుని పాదపద్మము లను విశాలనౌకయే శరణ్యము

2. శిష్యుడు:- బంధ మనగా నేమి? మోక్ష మనగా నేమి?

గురువు:- ప్రాపంచిక విషయ భోగములందు ఆసక్తి గలిగి యుండుటయే బంధము, వానియందు విరక్తి గలిగి యుండుటయే మోక్షము.

3. శిష్యుడు;- దుఃఖమును నశింపజేయున దేది ?

గురువు:- వేదాంత బోధవలన జనించిన ఆత్మజ్ఞానమే దుఃఖమును నశింపజేయును (తన్ను తాను తెలిసికొనుట దుఃఖ నివారణోపాయమని భావము.)

4. శిష్యుడు:- పరమాత్మని జేరుటకు తత్క్షణమే చేయదగిన పనులేవి?

గురువు:- సత్సాంగత్యము, దానము, స్వస్వరూప విచారణ, సంతుష్టి, మమకారత్యాగము, భగవంతుని యెడల భక్తి–వీనిని అభ్యసించవలెను. ఇంద్రియములు ప్రబల శత్రువులు. కావున వానిని మొట్టమొదట నిగ్రహించవలెను. గురువును, దైవమును, అనుభవజ్ఞులగు మహాత్ములను సేవింపవలెను.

5. శిష్యుడు:- దరిద్రుడెవడు? ధనవంతు డెవడు?

గురువు:- అంతులేని ఆశగలవాడే దరిద్రుడు! ఎల్లపుడు తృప్తి గలవాడే ధనవంతుడు.

6. శిష్యుడు:- బ్రతికి చచ్చిన వాడెవడు?

గురువు:- మోక్షమునకై ప్రయత్నించనివాడు బ్రతికి యున్నను చచ్చినవాడే యగును.

7. శిష్యుడు:- దుఃఖమునకు మూల మేమి?

గురువు:- "నేను, నాది" అనెడి అభిమానమే సమస్త దుఃఖములకును మూలము.

8. శిష్యుడు:- ప్రాణములు కంఠగతములైనను చేయరాని పని యేది? చేయదగిన పని యేది?

గురువు:- ప్రాణములు కంఠగతములైనను పాపము చేయరాదు. పరమాత్మను పూజింపవలయును, ధనము, యౌవనము ఆయువు–ఇయ్యవి క్షణ భంగురములు, కావున దారిద్ర్యము సంభవింపక మునుపే, యౌవనము క్షీణింపక ముందే, ఆయువు నశింపక పూర్వమే భగవత్ప్రాప్తికై యత్నము సలుపవలెను.

9. శిష్యుడు:- దేనిని చేసినచో ఇక దుఃఖింపవలసిన పనిలేదు?

గురువు:- భగవంతునియొక్క పూజ నొనరించినచో ఇక మనుజుడు దిగులు నొందవలసిన పనిలేదు.

10. శిష్యుడు:-రాత్రింపగళ్ళు దేనిని గూర్చి చింతించుచుండ వలెను?

గురువు:- ప్రపంచము యొక్క మిథ్యాత్వమును గూర్చియు, ఆత్మ యొక్క సత్యత్వమును గూర్చియు అహర్నిశము తలంచుచుండవలెను.

శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు ప్రశ్నోత్తర రూపముగ దెలిపిన ఈ తత్త్వోపదేశమును ముముక్షువు లెల్లరు చక్కగ మననము చేసి భక్తిజ్ఞాన వైరాగ్యోపేతులై ఆత్మానుభూతిని బడసి ఈ జీవితము నందే నిరతిశయ బ్రహ్మానంద ప్రాప్తిచే ధన్యులయ్యెదరు గాక!

ఓం తత్ సత్

సదుపదేశములు

శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

(1) సాధకుడు ప్రారంభమున చిత్తమును, ప్రార్థనా నామస్మరణాదులచే పరమార్థ రంగమున ఒకింత పైకి లేపి ఆ పిదప తత్త్వ విచారణచే ఊర్ధ్వముగ గొనిపోవలెను.

(2) మనస్సు రాగాది కషాయయుతమై మలినముగా నున్నచో దైవమునందు గాని, దైవవాక్కునందు గాని, అభిరుచి గలుగదు. కావున విషయభోగములందు విరక్తి గలిగి యుండవలెను.

(3) బ్రహ్మజ్ఞాన సౌధమునకు వైరాగ్యము పునాది వంటిది. పునాది గట్టిగ లేనిచో ఎంత పెద్ద భవనమయినను అచిరకాలములో కూలి పోవునట్లు విషయవిరక్తి సంపూర్ణముగ లేనిచో తత్త్వజ్ఞానము నిలువదు. కావున సాధకుడు సంపూర్ణ విషయ విరక్తి కలిగియుండవలెను.

(4) $\frac{\text{దైవము}}{\text{మాయ}}$ అను భిన్నము **Fraction** లో క్రింది సంఖ్యయగు మాయ అధికమగుకొలది పైసంఖ్యయగు దైవము తగ్గుచుండును. అట్లే మాయాగుణములు, ఆశా పిశాచము, కామ క్రోధాదులు, జీవుని యందు ఎంతెంత అధికమగుచుండునో అతనియందున్న దైవత్వము అంతంత సన్నగిలిపోవుచుండును. అవి ఎంతెంత తగ్గుచుండునో దైవత్వము అతనియం దంతంత ప్రబలుచుండును. ఏనాడు ఈ మాయాగుణములు సంపూర్ణముగ తొలగిపోవునో, అప్పుడు కైవల్యము మాత్రము శేషించును.

(5) బిడ్డ ఊయలయందు పరుండి ఏడ్చినచో తల్లి అన్ని పనులు వదులుకొని అచటికి పరుగెత్తుకొని వచ్చి అతని యోగక్షేమముల విచారించునట్లు భక్తుని మొరను భగవంతుడు ఆలకించుచునే యుండును.

కావున మీదృష్టిని ప్రాపంచిక సుఖములనుండి మరల్చి దైవమునందు నిలిపి ఆ దైవము కొరకై పరితపించుడు.

(6) దేవుడున్నాడా? ఉన్నచో మాకు కనుపించుటలేదే? అని యనకుడు కనుపించని వస్తువే లేదనుటకు సిద్ధాంత మైనచో వాయువు కన్నులకు కనిపించునా? ఆకాశము కనుపించునా? తన కన్ను తనకు కనుపించునా? పగలు నక్షత్రములు కనిపించునా? లేదు. అంత మాత్రము చేత అవేవియు లేవనవచ్చునా? కాదు. పాలలోని వెన్న స్థూల నేత్రమునకు కానరాదు. కాని వివేకముతో తెలిసికొనవచ్చును, ప్రయత్నముతో ప్రత్యక్షముగా చూడవచ్చును. అట్లే భగవంతుని వివేక నేత్రముతో చూడవచ్చును. సాధనచేసినచో ప్రత్యక్షముగ భగవదనుభూతిని పొందవచ్చును.

(7) ఈ ప్రపంచమునగల ప్రతి వస్తువున్ను పరిణామ శీలమైనది, ఈనాడు రమణీయముగనున్న పుష్పమాల రేపటికి వాడిపోవుచున్నది. ఆ మరునాటికి కుళ్ళిపోవుచున్నది. నేడెంతయో రమణియముగనున్న సౌదములు నగరములు కొంతకాలమునకు శిథిలములై స్మృతిమాత్రంతో శేషించు చున్నవి. ఇప్పుడిచటనున్న అణువురేపు ఇచటికి రావచ్చును ప్రతి ఏడు సంవత్సరములకు ఈ శరీరంలోని అణువులన్నియు పోయి క్రొత్త అణువులు చేరునని విజ్ఞానశాస్త్ర సిద్ధాంతం. ఈ ప్రకారముగ దృశ్యమంతయు పరిణామశీలమై యున్నది, కాని ఇవన్నియు మారుచున్నను, నశించుచున్నను ఏ పరిణామం లేనిదై అవినాశియై, వీని కన్నింటికిని ఆధారమైనట్టి వస్తువొకటి కలదు. అదియే దైవము అట్టి దైవమును మీలో దర్శించుడు.

(8) మానవజన్మము సార్థకము కావలెననిన ప్రజ్ఞానరూప బ్రహ్మమును అనుభూతం చేసికొనవలెను.

ఓం తత్ సత్

జ్ఞానపుష్పము–7

ధ్యానము

తదేకనిష్ఠతో ఒకానొక వస్తువునుగూర్చి చింతించుట ధ్యానమనబడును, సామాన్యమానవుని శక్తులన్నియు నశ్వరములగు ప్రాపంచిక పదార్థములను ధ్యానించుటయందే వ్యర్థములై పోవుచున్నవి. కాని ముముక్షువగువాడు తన శారీరక, మానసిక శక్తులన్నిటిని విషయోన్ముఖము కానీయక దైవ ధ్యానమందు వినియోగించుచుండును ఏలయనగా ఈ ప్రపంచమున భగవంతు డొకడే సత్యం; స్థిరం, మిగిలినదంతయు అసత్యము, అస్థిరము, నిరంతర దైవ ధ్యానంచే మనస్సు తదాకారాకారితమై, దైవమందే విలయమొంది దైవరూపమై విలసిల్లును, అదియే మోక్ష స్థితి. ఉప్పుకల్లు సముద్రమందు లయించి తద్రూపమే యగుచందమున, మనస్సు అనవరత పరమాత్మ చింతనచే దైవాకారమగుటయే కైవల్యప్రాప్తియగును. దుఃఖవర్జితమై నిరతిశయానంద రూపమైనట్టి అట్టిమహోన్నత స్థితిని సర్వ ప్రయత్నములచేతను ఈ జన్మయందే సాధించుట మానవుని కర్తవ్యమై యున్నది. దుర్లభమగు మానవజన్మను బడసియు అట్టి శాంతిదాయకమగు దైవ పథమును విడిచి మనుజుడు విషయోన్ముఖుడై యుండుట కడుంగడు శోచనీయం, అట్టి వాని జీవితము ముమ్మాటికి నిరర్థకమే యగును. కావున దైవప్రాప్తికై ధ్యానాది కార్యక్రమమును తప్పక ఏర్పాటు చేసికొనవలయును.

ప్రతిదినం ఉదయం బ్రహ్మ ముహూర్తముననే నిద్ర లేచి, స్నానాదులను నిర్వర్తించుకొని శుచిర్భూతుడై ఆసనంపై గూర్చుని శరీర కంఠ శిరంబులను సమముగ నిలిపి భ్రూమధ్యమందు గాని, నాశికాగ్రమున గాని, హృదయస్థానమందు గాని దృష్టిని నిలిపి పరమాత్మను ధ్యానించవలెను. నిర్గుణ బ్రహ్మమును గూర్చి చింతించుటకు

శక్తిలేనివారు సగుణరూపమగు ఇష్టదైవమును గురూపదిష్టమగు మంత్రము నుచ్చారణ చేయుచు ధ్యానించవచ్చును, అట్లు ధ్యానించునపుడు ధ్యేయవస్తువు తప్ప అన్యమేదియు చిత్తమున ఉదయించకుండులాగున ప్రయత్నించవలెను. ఒకవేళ ఉదయించినను. అయా దృశ్య వస్తువులను, సంకల్పములను బలాత్కారముగ తొలగింపక ఉపాస్య దైవమునందే దృష్టిని సంలగ్న పఱచియుంచినచో అవి వానియంతట నవియే తొలగిపోవును, ముఖ్యముగ సాధకుడగు వాడు ధ్యానకాలమున ఇంద్రియములనుబహివృత్తములు కాకుండ చూడవలెను అట్టితఱి మాత్రమే చిత్తము గాలిలేని చోటగల దీపమువలె నిశ్చలంగా నుండగలదు. నిశ్చల, నిర్మలచిత్తమే బ్రహ్మానందమును గ్రోల సమర్థమగునని సాధకులు జ్ఞప్తియందుంచు కొందరుగాక!

ఏ ప్రీతితో జనులు తమ యభీప్సిత ప్రాపంచిక వస్తువులను గూర్చి చింతన జేయుదురో, అట్టి ప్రీతితో భగవంతుని చింతన చేసిన చాలును. లక్ష్యము కరతలామలకమైపోవును, ఇందులకు దైవమందు అచంచల విశ్వాసము, భక్తి ఆవశ్యకములై యున్నవి. కావున జనులారా! నియమం లేర్పంచుకొని దినమందు కొంతసేపైనను దృష్టి బహిః ప్రపంచం నుండి, మరల్చి అంతర్ముఖ మొనర్చి భగవత్తత్త్వంను ధ్యానించుదురుగాక! పాపము నశించుటకును, అలౌకిక దివ్యానందమనుభవించుటకును ఇది యొకటియే మార్గమని మఱువకుందురుగాక! అమూల్యమగు ఈ జన్మను ఇంద్రియ సౌఖ్యముల కొఱకు ధారబోసి తుదకు శోకసంతప్తులగుట విజ్ఞులకు పాడికాదు. కావున రేపు""రేపు" అనక ఈ దినం నుండియే పరమాత్మ చింతనమును(దైవధ్యానమును) ఉపక్రమించి బ్రహ్మానంద సామ్రాజ్యాభిషిక్తులగుదురుగాక!

ఓం తత్ సత్

జ్ఞానపుష్పము-8

జపము

అనాది మాయా చక్రమున పరిభ్రమించుచు దుఃఖ సంతప్తులై యున్న జీవులకు ఆత్మజ్ఞాన మొకటియే తరుణోపాయము. కాని బహు జన్మార్జిత పాప పంకిలం హృదయమున పేరుకొని యుండుటచే అట్టి ఆత్మజ్ఞానము జనులకు గలుగకున్నది. కాబట్టి తత్పాపక్షయమునకై ప్రప్రథమమున ఏదేని యుపాయ మన్వేషింపవలెను. భగవన్నామ స్మరణ మొకటియే అందులకు సులభమైన ఉపాయం. 'జపతో నాస్తిపాతకమ్' అనునట్లు భగవన్నామ జపముచే దురితములెల్ల శీఘ్రమున సంక్షయములై పోగలవు. కావున శాంతిని, సుఖమును. భగవదనుగ్రహమును, జన్మ రాహిత్యరూప మోక్షమును కాంక్షించు ప్రతి జీవియు ఈ "జప" రూప సాధనను తప్పక అవలంబించవలసి యున్నది.

జపము చేయునపుడు సాధకులు ఈ క్రింది నియమములను పాటించవలెను :-

1. ఒక్కొక్క భగవన్నామము కోట్లకొలది ధనరాసుల కంటెను అధికమగు విలువగలిగియున్నదను విశ్వాసము గలిగియుండవలెను.

2. భగవన్నామము యొక్క మహిమచే తన పాపజాలమంతయు భస్మీభూతమగుచున్నదను భావన గలిగి తిరిగి అట్టి పాప కార్యములను ఎన్నటికిని చేయక యుండవలెను

3\. ప్రణవమును (ఓంకారం)గాని, రామ నామమునుగాని, కృష్ణ నామమునుగాని, శివ నామమునుగాని, విఠల్ నామమునుగాని, కలికల్మష నాశన మహామంత్రమగు "ఓం హరేరామ హరేరామ రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే అనుదానిని సమయం దొరికినపుడెల్ల ముముక్షువు భక్తిపూర్వకంగా జపించుచుండవలెను.

4\. జపమును ప్రారంభంలో 'వాచికము' (పెద్దగ ఉచ్ఛరించుట)గ మొదలుపెట్టినను క్రమంగ 'మానసికము'గ అభ్యసించవలెను.

4\. జపం చేయునపుడు ఆయా ఇష్టదేవతయొక్క స్వరూపం చక్కగ మనస్సునకు గోచరం కావలెను. అన్య విషయములను చింతింప రాదు. ధ్యేయవస్తువునందే మనస్సు నిలుకడ కలిగియుండవలెను.

6\. మంత్రజపంతోపాటు మంత్రార్థమునుగూడ చింతన చేయవలెను. అర్థభావన లేక చేయబడు జపం పూర్ణఫలితము నొసంగజాలదు,

7\. జ్ఞాపకార్థముగ ఒక జపమాలను సదా దగ్గర ఉంచుకొనుటమంచిది. లేక మెడలోనైనా ధరింపవచ్చును.

8\. జపకాలమున తరువాత కూడ నిత్యజీవితమునందు అట్టి పవిత్ర భావనయే కలిగియుండి ఆచరణయందు ఏ లోటుపాట్లు కలుగనీయకుండ చూడవలెను.

9\. నామ జపమునకు ప్రారంభంలో కొన్ని సమయము లేర్పరచు కొన్నప్పటికిని, క్రమక్రమంగ ఎల్లవేళలయందును దైవమును స్మరించుటను అభ్యసించవలెను.

"తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ"

అను భగవద్వాక్యమును కార్యాన్విత మొనర్చుటకు యత్నింప వలెను.

10. భగవంతుని పైనను, భగవంతుని నామం పైనను జీవునకు ఎంతెంత విశ్వాసము అధికముగ గలిగియుండునో అంతంత సత్ఫలిత మాతనికి అధికంగ కలుగుచుండును. కావున భగవంతుని యెడలను, భగవన్నామం యెడలను సాధకుడు పరిపూర్ణ విశ్వాసం గలిగియుండవలెను.

దేవే తీర్థే ద్విజే మంత్రే దైవజ్ఞే భేషజ్ఞే గురౌ
యాదృశీ భావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ.

అనగా దైవమునందును, తీర్థమునందును, బ్రహ్మనిష్ఠునియందును, మంత్రమందును, జ్యోతిష్కునియందును, ఔషధమునందును, గురువునందును జీవుడెట్టి భావన గలిగియుండునో అట్టి ఫలితమునే పొందగల్గును. కావున మంత్ర జపమునందు భావన అతి ప్రధానమై యొప్పుచున్నది.

ఓమ్ తత్ సత్

సాధన

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి ద్వాదశ హితోక్తులు

1. ప్రతిదినం ఉదయం 4 గంటలకు నిద్రలెమ్ము. అది బ్రహ్మముహూర్తం, భగవద్ధ్యానమునకు అత్యంత అనుకూలమైన సమయం.

2. రాత్రి పరుండబోవునపుడు, ఉదయం నిద్రలేచునపుడును నీవు చేసిన తప్పులను గూర్చి దీర్ఘాలోచనచేసి పశ్చాత్తాపపడి, ఇక మీద అవి చేయకుండు లాగున దృఢనిశ్చయం చేసికొనుము. అట్టి చిత్తస్థైర్యమును నీ కొసంగులాగున భగవానుని వినమ్రముగా ప్రార్థింపుము.

3. నియమము తప్పక ప్రతిదినం కొంతసేపు భగవద్ధ్యానం చేయుము. దైవచింతన లేకుండ భోజనము చేయరాదను దృఢవ్రతము కలిగియుండుము,

4. ప్రతిరోజు శ్రీ భగవద్గీతయందలి ఒక్క యధ్యాయమును పారాయణము చేసి. దాని తాత్పర్యమును మననము చేయుము. మరియు ఒక జపమాల గైకొని 108 పర్యాయములుగాని, అంతకెక్కువగాని ఏదైన దివ్యమంత్రమును జపింపుము.

5. వారంలో ఒక్క రోజుగాని, లేక రోజులో కొన్ని గంటలుగాని మౌనం శీలింపుము.

6. ఏకాదశియందు ఉపవాసం చేయుము. పక్వాహారం కంటె అపక్వాహారం శ్రేష్ఠమైనది. నీవు భుజించు ఆహారం న్యాయార్జితముగను, భగవదర్పితముగను, సాత్త్వికముగను ఉండవలెను.

7. (ప్రాపంచిక) కోరికలకు అంతులేదు. తుదకు అవి దుఃఖమునే కలుగజేయును. భగవద్ధ్యానమునకు అవి మహా ప్రతిబంధకములు. కావున వానిని క్రమక్రమముగ తగ్గించుకొనుచువచ్చి తుట్టతుదకు నిశ్శేషముగ తొలగించి వేయుము.

8. శ్రీ వసిష్ఠమహర్షి ఈ క్రింది చక్కని ఉపదేశమును చేసియున్నారు. ఆహారము కొఱకు (కుటుంబ నిర్వహణాదుల కొఱకు) ఏదైన కర్మమును (ఉద్యోగ వ్యవసాయాదులను) ధర్మపూర్వకంగా నాచరించుకొనుము. ఆ యాహారమునో, దేహము నిలుచుట కొఱకు మాత్రమే భుజింపుము. (భోగము కొఱకు కాదు). ఈ దేహమునో ఆత్మజ్ఞాన సంపాదనార్థమే వినియోగింపుము. ఆ యాత్మజ్ఞానమే జన్మ రాహిత్యమును కలిగించి తీరును.

9. రేపు చేయవలసిన పనిని ఈ దినమేచేయుము. సాయంత్రం చేయవలసిన పనిని ప్రొద్దుననే చేయుము. ఈ రీతిగా జీవితంలో చేయవలసిన పనులను త్వరత్వరగ పూర్తిచేసికొనుము. ఏలయనిన, మృత్యువు కనిపెట్టుకొని యున్నది,

10. ప్రపంచంలో ఏ వస్తువును పోగొట్టుకొనినను తిరిగి సంపాదించవచ్చును గాని, పోయిన సమయమును మాత్రం మరల సంపాదింపలేము. జీవితంలోని ఒక్కొక్క నిమిషం అనేక కోట్ల రూపాయలతో సమానం. కావున అతి జాగరూకుడవై సమయమును దైవకార్యాదులందు వినియోగింపుము.

11. లౌకికంగా నీవు ఎంత ప్రజ్ఞావంతుడవైనను గురు భక్తి, దైవభక్తి లేనిచో వేదాంత విషయం ఒక్కటికూడ నీకు అనుభవమునకు రాదు. కాబట్టి మొట్టమొదట గురువుయెడలను, దైవం యెడలను మిక్కుటమగు భక్తి కలిగియుండుట నేర్చుకొనుము.

12. సాధనము చేయుటకు సమయం లేదను సాకు చెప్పి తప్పించుకొనకుము, నిద్రను, వృథాగోష్ఠిని తగ్గించుకొనినచో దైవ ధ్యానమునకు కావలసినంత సమయం మిగులును.

ఓమ్ తత్ సత్

జ్ఞానపుష్పము – 10

జీవితలక్ష్యము

శిశువు పుట్టగనే ఏడ్చును, ఏడ్పుతో జీవితం ప్రారంభమైనది. కాని ఆనందంతో అంతం కావలెను, అదియే జీవిత లక్ష్యం. అయితే భోగజనితమగు ఆనందంకాదు మనకు కావలసినది. యోగజనితమగు ఆనందం. భోగానందం అశాశ్వతం, దుఃఖమిశ్రితం, యోగానందం శాశ్వతం, దుఃఖవర్జితం అట్టి యోగానందం (బ్రహ్మానందం) జీవున కెట్లు లభించును? అవిద్య, కామ, కర్మలను గోతులలో దొర్లాడుచు దేహభ్రాంతితో కూడుకొని వాసనా వివశుడైనట్టి జీవునకు అట్టి ఆనందం యొక్క లవలేశమైనను అనుభవమునకు రానేరదు. జీవుడు ఎంతవఱకు తాను తన నిజరూపమగు ఆత్మను తెలిసికొనకయుండునో ఎంతవఱకు తాను పంచభూతాత్మకమగు దేహమను భావం గలిగి యుండునో. ఆ దేహమునకు సంబంధించిన దారాపుత్రాదులందు మమత్వం కలిగియుండునో అంతవరకు అతనికి పూర్ణానందంయొక్క అనుభూతి కలుగకయే యుండును.

కాబట్టి దృశ్య వ్యామోహరహితుడై తన్ను తాను తెలిసికొనుటయే జీవితం యొక్క పరమావధి. ఆత్మ సాక్షాత్కారమే జీవిత లక్ష్యం, దృక్స్వరూపమగు పరమాత్మ దృశ్యరూపమగు జగత్తు అజ్ఞాని దృష్టియందు కలిసిపోయినవి. వాటిని విడదీయవలెను. పంచ కోశములను వేఱుజేసి, తద్వి లక్షణమైనట్టి సాక్షియగు ఆత్మను ప్రత్యక్షముగ అనుభూత మొనర్చుకొనవలెను. అచంచల దైవ విశ్వాసము నిర్మలభక్తి (దైవపరితపన) నిష్కామ కర్మాచరణము, పూర్ణ వైరాగ్యము-అట్టి ధ్యేయస్థితికి పునాదులుగా వున్నవి వాటిపైననే ధ్యేయాకారం (ఆత్మ) యొక్క అనుభవరూప సౌధము నిర్మింపబడ గలదు.

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే.

అనగా, "ఎవరు నిరంతరం ప్రీతితో నన్ను భజించుచున్నారో, అట్టివారికి నేను బుద్ధియోగం (వివేకము)ను ప్రసాదించుచున్నాను. దాని సహాయమున వారు నన్ను పొందగలరు" అని శ్రీకృష్ణ భగవానుడు గీతయం దుపదేశించెను కాబట్టి వివేకమునకు భక్తివైరాగ్యాదులు సాధనములుగా ఆధారభూతములుగా నున్నవి. ఇక్కారణమున మున్ముందు ఆ భక్త్యాదులను సంపాదించుట ద్వారా ఆత్మజ్ఞానమును జేబట్టవలెను. సంసార తారణమున కిదియే ఏకైక మార్గం. జీవితలక్ష్యమున్ను ఇదియే.

వాస్తవముగ జీవుడు అల్పుడు కాదు, అనంతుడు; పాపి కాదు, పుణ్యాత్ముడు, దేహము కాదు, దేహి, ఇవ్విషయమున వివేకానందుల సింహగర్జనము నాలకింపుడు.

"Each soul is potentially divine: the goal is to manifest the divinity within by controlling nature both external and internal. Do this either by work or worship or psychic control, by one or more or all of these and be free. This is the whole of religion."

అనగా ప్రతి జీవియు మూర్తీభవించిన పరమాత్మ స్వరూపం తనలోని అట్టి ఆత్మరూపములు - బాహ్యాభ్యంతర ప్రకృతులను జయించుటద్వారా-మవ్యక్త మొనర్చుటయే జీవుని లక్ష్యం. ఇక్కార్యమును కర్మచేగాని. భక్తిచేగాని, ధ్యానముచేగాని, ఇంద్రియ నిగ్రహముచే గాని, వీనిలో ఒకదానిచే గాని, లేక కొన్నిటిచేగాని. లేక అన్నిటిచేగాని సాధించి విముక్తుడవగుము. ఇదియే సర్వమత సిద్ధాంత సారము."

వివేకానందులు ఎలుగెత్తి చాటిన ఈ గంభీర వాక్యములను కార్యాన్వితమొనర్చి, తవ జన్మహక్కైన ఆత్మ సామ్రాజ్యాధిపత్యమును బడసి, ఈ జన్మయందే నిరతిశయానంద మనుభవించుచు జీవితమును ధన్యమొనర్చుకొందురు గాక !

వైరాగ్యము

జీవితం క్షణభంగురము. స్థావరజంగమాత్మక మగు ఈదృశ్య ప్రపంచమునం దెచటను స్థిరముగనుండు పదార్థ మేదియును లేదు. కాలముచే గ్రసింపబడని వస్తువు ముల్లోకములందును లేదు. సూర్యుడు, చంద్రుడు, భూమి, నక్షత్రాదులు–వెయ్యేల, సమస్త దృశ్యపదార్థములున్ను కాలగర్భమున అంతరించిపోవుచున్నవి, ఇక మన శరీరమా శాశ్వతము ?

కావున దేహము నశింపక పూర్వమే తరుణోపాయమును వెదకుకొనవలెను. సంసార దుఃఖరాహిత్యమునకై మార్గమును అన్వేషింపవలయును. దుఃఖములు ఆశ్రయింపక ముందే, ఆపదలు రాక పూర్వమే, ఇంద్రియములు సామర్థ్యము క్షీణించకముందే సద్గురువుల నాశ్రయించి ఆత్మజ్ఞానమును బడయవలెను.

ముసలితనము పెద్ద పులివలె ఎదురుగా కాచుకొని యున్నది. భయంకర వ్యాధులను సైనికులు గల్గి మృత్యువను శత్రువు వెన్నంటుచున్నాడు. ఆయువు ఓటికుండలోని నీటివలె క్రమంగా క్షీణించిపోవుచున్నది. శరీరం శిథిలమైపోవుటకు సిద్ధంగా వున్నది. ఇట్టి స్థితియందు తరించు ఉపాయమును ఇంకను వెదకుకొననివాసూడు మందభాగ్యుడే యగును. మోక్షప్రాప్తికి అనుకూలమైనట్టి మనుష్య జన్మనుబొందియు ఎవడు భగవచ్చింతనాదులచే సంసారమను వ్యాధిని నివారింపజేసికొనకుండునో అట్టివాడు చేతియందున్న కౌస్తుభమణిని జారవిడచుకొన్నవాడే యగును.

కాబట్టి పరమార్థమును శీఘ్రముగా వెదకుకొనవలెను. ఆయువు యొక్క ఒక్కొక్క క్షణం ఎంతయో విలువ గలిగియున్నది. దైవ స్మరణచే అట్టి ఆయువును సద్వినియోగము చేసికొనవలెను. క్షణికములైన ప్రాపంచిక వస్తువుల సంపాదనమునందు మునిగిపోయి భగవంతుని మఱువరాదు. శాశ్వతానందము నొసగూర్చునదియు జన్మ రాహిత్యమును గలుగుజేయునదియు, దుఃఖమును సమూలముగ నశింప జేయునదియు నగు సద్వస్తువైన ఆత్మయే (భగవంతుడే) జీవులకు శరణ్యము గాని మరి ఏ యితర పదార్థమున్ను గాదు.

అట్టి దైవప్రాప్తికి విషయ విరక్తియే ప్రథమ సాధనము. భోగ భాగ్యములందలి వైరాగ్యభావనయె అద్దానికి మొదటి మెట్టు. కావున దృశ్య వస్తువులయొక్క అశాశ్వతత్వమును చింతనజేయుచు, ప్రబల వైరాగ్యము గలిగి ఆత్మోన్ముఖులై శాశ్వత బ్రహ్మానందము నొంది జీవితమునకు ధన్యమొనర్చుకొందురు గాక !

ఓం తత్ సత్

జ్ఞానపుష్పము–12

నిర్భయత్వము

మానవుని మాధవునిగ మార్చునది సచ్ఛీలము. మానవుని దానవునిగ రూపొందించునది దుశ్శీలము. దుశ్శీలమును వీడి సచ్ఛీలం నాశ్రయించుటయేమానవతా చిహ్నము.**Character is 3/4religion** సద్గుణసమాశ్రయత్వమే ముప్పాతిక మతమని చెప్పబడినది. అది లేనిచో మతమునకు గాని, మానవునకు గాని విలువేయుండదు. కాబట్టి శీల సంపాదన, సద్గుణావలంబనము జీవితమునందలి అతి ముఖ్యమైన అంశమని విజ్ఞులు పేర్కొనిరి.

అతి సద్గుణములన్నిటిలోను నిర్భయత్వం శిరోమణియై యలరారుచున్నది. కనుకనే శ్రీకృష్ణపరమాత్మ నిర్భయత్వ, ధైర్యోత్పాదక వచనములతో గీతను ప్రారంభించెను. ఇంతియే కాదు దైవగుణములలో దానిని ప్రప్రథమముగ పేర్కొనెను. • భయస్థుడు దుర్బలుడు ఏ కార్యమును సాధింపజాలడు లౌకికరంగమునందు గాని, పారలౌకిక క్షేత్రమునందు గాని భయశీలుడు పిరికిపంద ఒక్క అడుగైనను ముందునకు వేయజాలడు. ప్రపంచమున మహత్కార్యములన్నిటిని

• క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప (భ గీ. 2-3)

• అభయం సత్యసంశుద్ధిర్జ్ఞాన యోగవ్యవస్థితిః (భ. గీ, 16-1)

నిర్భయచేతస్కులే సాధింపగల్గిరి. మోక్షమను చరమలక్ష్యమును గూడ అట్టి అభయచిత్తులే కైవశమొనర్చుకొని యుండిరి.

అయితే, భయమును త్యజించుట ఎట్లు? అనునదియే ప్రశ్న. అందులకై భయం యొక్క మూలకారణమును విచారింపవలయును. దేహాభిమానమే భయమునకు మూలము, దృశ్యవస్తువులపై మమతయే భయమునకు ప్రధానకారణం. అవి యున్నంతవరకు భయం మానవుని విడనాడ జాలదు. మఱియు శాశ్వతవస్తువగు పరమాత్మ నాశ్రయించనంత వరకు జనులను భీతి వెన్నంటుచునే యుండును. హిరణ్యకశిపుడు ఎన్నియో యిడుమలబాలు జేసినప్పటికిని ప్రహ్లాదుడేల భీతి చెందలేదు? దేహాభిమానమును వదిలివేసి విష్ణుభగవానుని ఆశ్రయించెను గనుక.

రామనామ జపతాం కుతో భయం

రామనామము జపించువానికి (భగవంతుని ఆశ్రయించువానికి) ఇక భయ మెచట? అని ప్రహ్లాదుడు తండ్రిని నిలదీసి ప్రశ్నించెను. కాబట్టి నిర్భయత్వమును దైవీసంపదను వాంఛించువాడు. దేహాది ప్రాపంచిక వస్తువుల యెడల మమత్వమును పారద్రోలి, భగవంతుని యందు భక్తిని అలవరచుకొనవలెను, చంచలములగు పదార్థములను పట్టుకొనువాడు, క్షణికమగు దేహంపై విశ్వాసము కలవాడు భయమను పెనుభూతమునకు వశుడై పోవును, అచంచలమై శాశ్వతమైనట్టి పరమాత్మ నాశ్రయించువాడు సర్వ కాలములందును నిర్భయుడై వెలయుచుండును. తల్లి యొడియందున్న పసికందు యెన్నడైన భీతిం జెందునా? గట్టి స్తంభమును పట్టుకొని తిరుగు వాడెన్నడైనా క్రింద పడునా? పడడు.

మఱియు పూర్ణ భయరాహిత్యం కేవల అద్వైత స్థితియందే జీవునకు సిద్ధించుచున్నది. దైవం (ఆత్మ) మినహా మఱియొక వస్తు వున్నదని భావించిన వెంటనే భయం వచ్చి జీవుని బాధించుచున్నది.• కాబట్టి దృశ్య వస్తువుల యెడల వాంఛలను తగ్గించుకొనుచు. అట్టి అద్వయ పరమాత్మ సాక్షాత్కారమునకై మనుజుడు లెస్సగ అభ్యాసం సలుపవలయును. దుఃఖరాహిత్యమునకు, ఆనంద ప్రాప్తికి అభయస్థానమగు * అట్టి ఆత్మయె శరణ్యం. ఇవ్విషయమున శ్రీ వివేకానందుల గంభీర వచనములు పేర్కొనదగియున్నవి.

"The only religion that ought to be taught is the religion of fearlessness, It is fear that brings misery, fear that brings death, fear that breeds evil and what causes fear? Ignorance of our own nature."

"నిర్భయత్వ" మనమే యిపుడు చాటదగిన ఏకైక మతం, ఏలయనిన భయమే దుఃఖమును గలుగజేయును, భయమే చావును తెచ్చును, భయమే దోషమును సృజించును, ఇట్టి భయం దేనివలన కలుగుచున్నది. మన వాస్తవ స్వరూపమును మనం మరచినందు వలననే."

కావున వివేకవంతుడు ప్రయత్నపూర్వకంగ ఈ భయమను దుర్గుణమును తన హృదయసీమ నుండి ఏరిపారవేసి నిర్భయత్వమను

• ద్వితీయాద్వై భయం భవతి (బృ. ఉ.)

* అభయంవై జనక ప్రాప్తోఽసి (బృ. ఉ.)

సుగుణరాజమును తనయం దలంకరించుకొనవలెను. మోక్షమునకు రాజబాట యిదియేయని ముముక్షువులు సర్వదా జ్ఞప్తియందుంచు కొందురు గాక! భయమును పారద్రోలుడు (విగతభీః) అను గీతా శంకారావము దిశదిశలు వ్యాపించి సర్వుల శ్రుతి పుటములందు ప్రతిధ్వనించు గాక! "అభయం" (**Be fearless**) అను మంత్రరాజమును ఎల్లరును నిరంతరం పఠించి, జపించి, స్మరించి, అనుభూతమొనర్చుకొని తరింతురు గాక!

హరిః ఓం తత్ సత్